# మామిడితాండ్ర.. చూస్తే నోరూరాల్సిందే

- ఊనగట్లలో కుటీర పరిశ్రమగా అభివృద్ధి
- వేసవిలో ఎంతో మందికి ఉపాధి

**చాగల్లు:** ఊనగట్ల పేరు వినగానే తియ్యని మామిడితాండ్ర గుర్తొస్తుంది. చాగల్లు మండలంలోని ఈ గ్రామంలో మామిడి తాండ్ర తయారీ కుటీర పరిశ్రమగా అభివృద్ధి చెందింది. మామిడి పండ్ల గుజ్జు నుంచి తాండ్ర తయారు చేస్తారు. ఏటా ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఈ గ్రామంలో మామిడి తాండ్ర తయారీ ముమ్మరంగా జరుగుతుంది. మామిడి పండ్లను గతంలో రోళ్లలో వేసి కుమ్మి గుజ్జు తీసేవారు. ఇప్పుడు అధునాతమైన యంత్రాలు సహాయంతో గుజ్జు తీస్తున్నారు.ఆ గుజ్జులో బెల్లం లేదా పంచదార కలిపి ఆరుబయట తాటాకు చాపలపై మామిడి గుజ్జును పూతగా పోస్తారు. ఈ విధంగా ఎండాకాలంలో రోజుకు ఐదు నుంచి ఎనిమిది పర్యాయాల చొప్పున వారం రోజులపాటు పూత పెడితే మామిడితాండ్ర తయారవుతుంది. చాపల మాదిరిగా ఉన్న తాండ్రను ఆరిన తరువాత వాటిని చిన్నసైజు ముక్కలుగా కోసి 50 కిలోలు చొప్పున పెట్టెల్లో ప్యాక్ చేసి భద్రపరుస్తారు.

మామిడితాండ్రకు కలెక్టర్, రసాలు, బంగినపల్లి వంటి రకాల మామిడి పండ్లను వినియోగిస్తారు.ఈ ఏడాది మామిడి పండ్లకు గిరాకీ ఎక్కువగా ఉండడంతో టన్ను రూ.18 వేల నుంచి రూ.20 వేల ధరకు కొనుగోలు చేస్తున్నట్టు మామిడితాండ్ర తయారీదారులు చెబుతున్నారు. ఇక్కడి తాండ్ర తయారీదారులు నిడదవోలు, కొవ్వూరుపాడు, ద్వారకాతిరుమల, తాడేపల్లిగూడెం, నూజివీడు, దొండపూడి తదితర మార్కెట్ల నుంచి మామిడికాయలను టన్నుల లెక్కన కొనుగోలు చేస్తారు. గతంలో దీంతో ప్రస్తుతం మామిడితాండ్ర తయారీ కేంద్రాలు గతంలో ఊనగట్లలో 40 వరకు తాండ్ర తయారీ కేంద్రాలు ఉండేవి. ప్రస్తుతం 10 కేంద్రాలకే పరిమితం అయ్యాయి.

**వేసవిలో ఉపాధి**

మామిడితాండ్ర పెద్ద తయారీ కేంద్రాల్లో 25 నుంచి 30 మంది, చిన్న కేంద్రాల్లో 15 నుంచి 20 మంది కూలీలు వేసవిలో ఉపాధి పొందుతున్నారు. ఊనగట్లలో 250 మందికి పైగా మహిళలు, పిల్లలు ఉపాధి పొందుతున్నారు. వ్యవసాయ పనులు లేని నడి వేసవిలో మామిడితాండ్రను తయారు చేస్తారు. దాంతో మహిళలకు ఆదాయ వనరుగా ఈ పరిశ్రమ ఉపయోగపడుతోంది. బడికి వెళ్లే పిల్లలు సైతం వేసవి సెలవుల్లో మామిడి తాండ్ర తయారీ పనులకు వెళ్లి, ఆ వచ్చిన సొమ్ముతో పుస్తకాలు, దుస్తులు వంటివి కొనుగోలు చేసుకుంటారు.

**రూ.లక్షల్లో వ్యాపారం**

మామిడితాండ్ర తయారీదారులు రోజుకు దాదాపు టన్ను మామిడికాయలను దిగుమతి చేసుకుంటారు. మామిడితాండ్రను ముక్కలుగా కోసి 50 కేజీల తాండ్రను ఒక పెట్టెలో పెడతారు. అలాంటి 200 పెట్టెలను లారీకి ఎగుమతి చేస్తుంటారు. టోకున మామిడి తాండ్ర ధర క్వింటాల్ రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకూ ఉంటుంది. ఆ వంతున రూ.40 లక్షల వరకు వ్యాపారం జరుగుతుంది. గతంలో ముంబై, చెన్నై తదితర ప్రాంతాలకు ఇక్కడి నుంచి తాండ్ర ఎగుమతి భారీ ఎత్తున జరిగేది. అయితే గతంలో వ్యాపారస్తులు మామిడితాండ్ర తయారీదారులను మోసగించి డబ్బులు సక్రమంగా చెల్లించకపోవడంతో చాలా వరకూ ఎగుమతులు తగ్గిపోయాయి. మార్కెటింగ్ లేక ఇబ్బందులు పడుతున్నామని తయారీదారులు చెబుతున్నారు. మామిడితాండ్రను స్థానికంగా అమ్మడానికే తయారీదారులు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. తయారీదారులే కాకుండా మామిడితాండ్రను సైకిళ్లపై విక్రయిస్తూ మరో వంద మంది వరకు ఉపాధి పొందుతున్నారు.



ఊనగట్లలో యంత్రం సాయంతో మామిడి పండ్ల నుంచి గుజ్జు తీస్తున్న కూలీలు



తాండ్ర తయారీకి వాడే మామిడిపండ్లు



అమ్మకానికి సిద్ధమైన తాండ్ర

### ఏడాది పొడవునా అమ్మకాలు



ఎన్నో ఏళ్లుగా మామిడితాండ్ర తయారీ పరిశ్రమ నిర్వహిస్తున్నాం.తయారైన తాండ్రను నిల్వ ఉంచి, ఏడాది పొడవునా విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నాం.

– కె. శ్రీనివాసరావు, తాండ్ర తయారీదారుడు, ఊనగట్ల

### మహిళలకు ఉపాధి



మామిడితాండ్ర తయారీ సీజన్‌లో మహిళలకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. పనిని బట్టి రోజుకు రూ.250 నుంచి రూ.300 వరకూ కూలి లభిస్తోంది. ఈ ప్రాంత మహిళల అభివృద్ధికి తాండ్ర పరిశ్రమ దోహదం చేస్తుంది.

– యాండ్ర మాణిక్యం, తాండ్ర తయారీ కూలీ, ఊనగట్ల

### కుటుంబానికి ఆసరా



ప్రతి ఏడాది సీజన్‌లో తాండ్ర తయారీ పనులకు వెళ్లడం వలన కుటుంబ పోషణకు ఎంతో ఆసరాగా ఉంటుంది. రోజుకు రూ.400 నుంచి రూ.600 వరకు కూలీ లభిస్తుంది.

-కె.సతీష్‌కుమార్, యువకుడు, ఊనగట్ల

## క్లుప్తంగా

### పశ్చిమ డెల్టాకు 3,000 క్యూసెక్కులు

**నిడదవోలు:** ఖరీఫ్ సాగు అవసరాల కోసం జల వనరుల శాఖ, ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ అధికారులు దశలవారీగా డెల్టా కాలువలకు నీటిని విడుదల చేస్తున్నారు. మండలంలోని విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు ఆదివారం 3,000 క్యూసెక్కుల వదులుతున్నారు. తూర్పుడెల్టాకు 1,590, మధ్య డెల్టాకు 1,140 క్యూసెక్కులు వదిలిపెట్టారు. పశ్చిమ డెల్టాలో ప్రస్తుతం ఖరీఫ్ సాగు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పొలాల్లో దమ్ములు, నారుమడుల తయారీ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. డెల్టా శివారు భూములకు కూడా నీటిని అందించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. పశ్చిమ డెల్టా పరిధిలో ఏలూరు కాలువకు 590, తణుకు కాలువకు 810, ఉండి కాలువకు 478, నరసాపురం కాలువకు 936, అత్తిలి కాలువకు 293 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

### విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేత



పశివేదల హైస్కూల్లో విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న దాతలు

**కొవ్వూరు:** మండలంలోని పశివేదల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వేములపల్లి రామకృష్ణారావు (గోపి), ఉండవల్లి మునేశ్వరరావు అనే దాతల ఆర్థిక సహకారంతో పశివేదల హైస్కూల్ విద్యార్థులకు క్రీడాసామగ్రి అందజేశారు. బాలురకు షటిల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ కిట్లు అందించారు. అలాగే బాలికలకు త్రోయింగ్ రింగ్స్‌తో పాటు పలు రకాల క్రీడాసామగ్రి అందించారు. శనివారం రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత పుట్టిన రోజును పురస్కరించుకుని వాటిని విద్యార్థులకు అందజేశామని దాతలు చెప్పారు.అలాగే పశివేదల గ్రామంలోని ఎస్సీ యువకులకు వాలీబాల్ కిట్లు కూడా అందజేసినట్టు గోపి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పల్లి రామకృష్ణ, వేములపల్లి పూర్ణచంద్రరావు, సొసైటీ డైరెక్టర్ దాసరి రాయుడు, కాకులపాటి వెంకటరమణ, కొడమంచిలి మంగ సత్యం, మల్లిపూడి టైసన్ తదితరులు పాల్గొన్నారు.

### పెరిగిన భూముల కౌలు ధరలు

**నల్లజర్ల:** ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో ఈ ఏడాది భూముల కౌలు ధరలు పెరిగాయి. మార్కెట్లో వాణిజ్య పంటల ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతులు పోటీపడి మరీ భూములను కౌలుకు తీసుకుంటున్నట్టు సమాచారం. నీటి వసతి ఉన్న భూములకు డిమాండ్ ఎక్కువగా ఉంది. ఇంతకు ముందెన్నడూ లేని విధంగా రైతులు వేలంలో పోటీపడి మరీ దేవదాయశాఖ భూములను దక్కించుకున్నారు. ఎకరం సాధారణ భూమికి రూ.25 వేల నుంచి రూ.35 వేల వరకూ కౌలురేట్లు పలుకుతున్నాయి. అరటి తోటలకు పోటీ పడి మరీ రూ.60 వేల వరకూ కౌలు చెల్లిస్తున్నారు. వేరుశనగ వేసే చేలలో రూ.45 వేల వరకు రేటు ఉంది. కౌలు కార్డుదాలలకు బ్యాంకులు రుణ సహాయం అందించడంతో పోటీపడి మరీ కౌలు ధరలు పెంచుతున్నారు. రబీలో మొక్కజొన్న సాగుచేసిన రైతులు అకాల వర్షాలతో దెబ్బతిన్నారు.ఆ నష్టాలను భర్తీ చేసేందుకు ఈసారి పోటీ పడుతున్నారు.

### ఉమా చోడేశ్వరునికి విశేష పూజలు



ఉమా చోడేశ్వరస్వామికి పూజలు చేస్తున్న పండితులు

**కొవ్వూరు:** స్థానిక పాతూరులోని ఉమా చోడేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు జరిగాయి. అమ్మవారికి శ్రీసూక్త విధానంలో కుంకుమ పూజలు, స్వామి వారికి బిల్వార్చన నిర్వహించారు. ఆషాఢ మాసం సందర్భంగా పట్టణానికి చెందిన వాడపల్లి నాగ సరిత ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.ఆలయ ప్రధానా ర్చకులు కొతవరపు భాను, దేవరకొండ ఉమ, దేవరకొండ సాయి ప్రతాప్ పూజా ఏర్పాట్లను పర్యవేక్షించారు. పమ్మి రవిబాబు,కలిగొట్ల కృష్ణారావు, బల్లమూడి సత్యనారాయణ మూర్తి, గుంటూరు వెంకట సత్యనారాయణమూర్తి, వైవీఎస్ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**కొవ్వూరు:** కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న షేక్ బాజీ (40) అనే వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. కొవ్వూరు రూరల్ ఎస్సై జి.సతీష్ కథనం ప్రకారం మండలంలోని కుమారదేవానికి చెందిన షేక్ బాజీ గత నెల 21న భార్యతో గొడవ పడ్డాడు. ఆమెను భయపెట్టే ఉద్దేశంతో అదే రోజున అతడు ఒంటిపై పెట్రోలు పోసుకుని లైటర్‌తో నిప్పంటించుకున్నారు. తీవ్ర గాయాలైన అతడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. మృతుడి సోదరి షేక్ బీబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. తాపీ పని చేసే షేక్ బాజీకి భార్య, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు.

### పేద రోగులకు పెన్నిధి సీఎం సహాయ నిధి



బట్టు వివేక్‌కు రూ.1.50 లక్షల సీఎం సహాయనిధి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

**నిడదవోలు రూరల్:** పేద రోగులు ఖరీదైన వైద్యం చేయించుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి పెన్నిధిలా ఆదుకుంటోందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం ముగ్గురు రోగులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఆదివారం సమిశ్రగూడెంలోని అంబేడ్కర్ కళావేదిక వద్ద ఎమ్మెల్యే అందజేశారు. మండలంలోని సమిశ్రగూడేనికి చెందిన బట్టు వివేక్‌కు రూ.1.50 లక్షల చెక్ అందజేశారు. అలాగే పెరవలి మండలం కొత్తపల్లి అగ్రహారానికి చెందిన చెల్లు రాజేష్‌కుమార్, వేల్పూరి వీరబ్రహ్మ వెంకట శ్రీనివాస్‌లకు కూడా సీఎం సహాయనిధి చెక్కులు ఎమ్మెల్యే అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్న ప్రియాంక, వైస్ ఎంపీపీ రత్నకుమారి, ఎంపీటీసీ అంగర ఝాన్సీరాణి పాల్గొన్నారు.

### నేడు హోం మంత్రి వనిత పర్యటన ఇలా..

**కొవ్వూరు:** రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత సోమవారం ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌కు రాజమహేంద్రవరంలోని కలెక్టరేట్ నుంచి హాజరవుతారు. సాయంత్రం 4.15 గంటలకు కొవ్వూరు మండలం ఆరికిరేవులలో నిర్మించిన ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్ భవనాలను, జల్ జీవన్ మిషన్ పనులను మంత్రి వనిత ప్రారంభిస్తారు. సాయంత్రం ఐదు గంటలకు చాగల్లులో జల్ జీవన్ మిషన్ పథకం ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. అనంతరం ఎస్.ముప్పవరంలో రైతు భరోసా కేంద్రం భవనాన్ని ప్రారంభిస్తారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయండి



సోషల్ మీడియా కన్వీనర్లకు బీమా పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

- సోషల్ మీడియా కన్వీనర్లకు ఎమ్మెల్యే తలారి విజ్ఞప్తి
- గుర్తింపు, బీమా పత్రాల అందజేత

**దేవరపల్లి:** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లి అవగాహన కల్పించాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్లను కోరారు. ఆ పార్టీ నియోజకవర్గంలోని నాలుగు మండలాల సోషల్ మీడియా కన్వీనర్ల సమావేశాన్ని ఆదివారం దేవరపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ కుసులూరి వెంకట సతీష్ సమావేశానికి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు నియోజకవర్గంలోని 50 మంది సోషల్ మీడియా కన్వీనర్లకు గుర్తింపు కార్డులు, బీమా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సోషల్ మీడియా కన్వీనర్‌కు ప్రభుత్వం రూ.5 లక్షల బీమా, రూ.2 లక్షల ఆరోగ్య బీమా సదుపాయాన్ని కల్పించిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, చిగురుపల్లి శామ్యూల్, రాష్ట్ర ఆయిల్‌పామ్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, నల్లజర్ల ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నల్లజర్ల మండల శాఖ అధ్యక్షుడు గగ్గర శ్రీనివాస్, పలువురు సొసైటీల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## వేములూరులో నూతన చర్చికి శంకుస్థాపన



వేములూరులో నూతన చర్చి శంకుస్థాపన వద్ద ప్రార్థన చేస్తున్న ఆర్‌సీఎం బిషప్ జయరావు తదితరులు

**కొవ్వూరు:** మండలంలోని వేములూరు గ్రామంలో రూ.కోటి వ్యయంతో పునీత ఆస్సీస్ పుర ఫ్రాన్సిస్ అనే కొత్త చర్చి నిర్మిస్తున్నారు. ఈ గ్రామంలోని దీప్తి పాఠశాల ప్రాంగణంలో నిర్మించే ఈ చర్చికి ఆదివారం రోమన్ క్యాథలిక్ మిషన్ (ఆర్‌సీఎం) బిషప్ పొలిమేర జయరావు శంకుస్థాపన చేశారు. ముందుగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రాంగణంలోని పురాతన చర్చి శిథిలావస్థకు చేరుకుంది. ఆ చర్చి స్థానంలో కొత్తగా ఈ చర్చిని నిర్మిస్తున్నారు. దీప్తి హైస్కూల్ గోల్డెన్ జూబ్లీ సందర్భంగా ఈ చర్చి నిర్మాణం చేపట్టామని జయరావు తెలిపారు. పాఠశాలల ఉత్సవాల్లో భాగంగా పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా సమావేశం నిర్వహించారు. చర్చి నిర్మాణానికి తమ సహకారం అందిస్తున్నామని పూర్వ విద్యార్థులు తెలిపారు. ప్రిన్సిపల్ ఎల్విన్, చర్చి ఫాదర్ ఫ్రాన్సిస్ గాబ్రియేలు, సంఘ పెద్దలు నెల్సన్ అంటోనీ, బి.విజయ్‌కుమార్,పొట్ల రాజేష్, డి.జాన్, వీటీ విల్సన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత చదువుకు 'మానవత' సాయం



శ్రీజకు రూ.10 వేల ఆర్థిక సాయం అందిస్తున్న మానవత ప్రతినిధి నాగేశ్వరరావు

**దేవరపల్లి:** పేద విద్యార్థిని మూడేళ్ల ఉన్నత చదువుకు ఆర్థిక సహాయం చేసేందుకు మానవత స్వచ్ఛంద సంస్థ గోపాలపురం మండలం శాఖ సభ్యుడు ముందుకొచ్చారు. వివరాలిలా ఉన్నాయి. గోపాలపురం మండలం, వెల్లచింతలగూడేనికి చెందిన కొలూరి శ్రీజకు గతేడాది జేఈఈలో 1046వ ర్యాంకు పొందింది. ఆమె మూడేళ్ల పాటు ఐఐటీ చదివేందుకు రూ.32 వేల ఆర్థిక సాయం చేసేందుకు మానవత సంస్థ ప్రతినిధి ఆలపాటి నాగేశ్వరరావు అంగీకరించారు. దీనిలో భాగంగా మొదటి ఏడాదికి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం గోపాలపురంలో జరిగిన మండల మానవత సంస్థ నెలారీ సమావేశంలో విద్యార్థిని శ్రీజకు నాగేశ్వరరావు అందజేశారు. గోనాదుల అప్పిరెడ్డి ఆ విద్యార్థినికి అవసరమైన పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ రాంబాబు, నెల్లి చంద్రశేఖర్, కె.కీర్తికుమార్, తదితరులు పాల్గొన్నారు.

**బాధిత కుటుంబాలకు...**

**నల్లజర్ల:** అనారోగ్యంతో బాధపడుతున్న నల్లజర్లకు చెందిన ఎస్.సింహాచలం కుటుంబానికి మానవత సంస్థ మండల శాఖ ఆదివారం రూ.5 వేల ఆర్థిక సాయం చేసింది. అలాగే చీపురుగూడెంలో అనారోగ్యంతో బాధపడుతున్న కె.విశాలక్ష్మి కుటుంబానికి ఆదివారం రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమాల్లో మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడు గుళ్ళపూడి వెంకటరత్నం, జిల్లా నియంత్రణ కమిటీ చైర్మన్ కండెపు వెంకట సూర్యనారాయణ, ఎన్.రాజేంద్రప్రసాద్, ఐడీవీ అప్పారావు, పీవీ అప్పారావు డాక్టరు సీతారాములు, డి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

### చిడిపిలో ఇంటింటికీ బీజేపీ

**కొవ్వూరు:** బీజేపీ శ్రేణులు ఆదివారం చిడిపి గ్రామంలో 'ఇంటింటికీ బీజేపీ' పేరుతో కార్యక్రమం నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనలో అందించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పెరుగు పోతురాజు తెలిపారు. దేశ ప్రయోజనాలతో పాటు రాష్ట్రాభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న సహకారం గురించి ప్రజలకు వివరించామని జిల్లా ప్రధాన కార్యదర్శి పిక్కి నాగేంద్ర అన్నారు. ఆ పార్టీ మండల శాఖ ఉపాధ్యక్షుడు చక్కా శ్రీనివాస్, చౌటుపల్లి బాబ్జీ, బీసీ మోర్చా మండలశాఖ అధ్యక్షుడు వాసాబత్తుల నాగేశ్వరరావు, అక్కబత్తుల చిన్నబ్బులు, పాలడుగుల సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఎక్కడి సమస్యలకు అక్కడే పరిష్కారం

- అందుకు 'జగనన్న సురక్ష' కు శ్రీకారం
- గోపాలపురం ఎమ్మెల్యే తలారి
- గౌరీపట్నంలో ఇంటింటి పర్యటన



దేవరపల్లి మండలం గౌరీపట్నంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తలారి



కొవ్వూరు మండలం కాపవరంలో ఇంటింటి సర్వేను పర్యవేక్షిస్తున్న ఆర్డీవో మల్లిబాబు

**దేవరపల్లి:** ప్రజా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆదివారం ఆయన గౌరీపట్నం గ్రామంలోని గౌడ వీధిలో ప్రారంభించారు. తహసీల్దార్ ఎం.రామకృష్ణ బృందంతో కలసి ఎమ్మెల్యే తలారి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్హులై ఉండి కూడా ఇంత వరకూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందని పేదలను గుర్తించి, వారికి లబ్ధి చేకూర్చడమే ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశం అన్నారు. జూలై 27 వరకూ వలంటీలర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, గ్రామ సచివాలయ సోషల్ మీడియా కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని, లబ్ధిదారులను గుర్తిస్తారన్నారు. అలాంటి వారికి పథకాలను మంజూరు చేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ రాయి అన్నపూర్ణ, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యులు పొట్టి స్వర్ణలత, చిగురుపల్లి శామ్యూల్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నరహరిశెట్టి రాజేంద్రబాబు, పార్టీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు కడలి హైమావతి తదితరులు పాల్గొన్నారు.

**సర్వేను పరిశీలించిన ఆర్డీవో మల్లిబాబు**

**కొవ్వూరు:** జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు చేస్తున్న ఇంటింటి సర్వేను కొవ్వూరు ఆర్డీవో ఎస్.మల్లిబాబు ఆదివారం మండలంలోని కాపవరం గ్రామంలో పరిశీలించారు.ఆ గ్రామ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేసి సర్వే నివేదికలను పరిశీలించారు. అనంతరం వలంటీర్లతో పాటు ఇంటింటి సర్వేలో ఆయన పాల్గొన్నారు. సర్వే తీరును ఆర్డీవో పరిశీలించారు. పారదర్శకంగా సర్వే నిర్వహించాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించి ప్రతి ఒక్కరికీ అవి అందుతున్నాయా, లేదా అన్న సమాచారాన్ని తెలుసు కోవాలన్నారు. ప్రజల నుంచి అభ్యర్థనలు స్వీకరించి టోకెన్ నంబర్లు జారీ చేస్తామన్నారు. గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణ తేదీ నాడు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు.

**నిడదవోలు మండలం గ్రామ సభల షెడ్యూల్**

**నిడదవోలు రూరల్:** మండలంలోని 22 గ్రామ సచివాలయాల పరిధిలో జూలై 1 నుంచి 27 వరకూ జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ పి.శామ్యేలు ఆదివారం తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి, సత్వరమే పరిష్కరిస్తామన్నారు. అంతేగాకుండా ఈ కార్యక్రమంలో 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తామని చెప్పారు. జూలై 1న విజ్జేశ్వరం, పందలపర్రు, 4న గోపవరం, పెండ్యాల, 6న కోరుపల్లి, పురుషోత్తపల్లి, 11న మునిపల్లి, అట్లపాడు, 13న కంసాలిపాలెం, డి.ముప్పవరం, 15న కాటకోటేశ్వరం, రావిమెట్ల, 18న కోరుమామిడి-1, తాడిమళ్ల -1, 20న కోరుమామిడి-2, తాడిమళ్ల-2, 22న సమిశ్రగూడెం-1, తాళ్లపాలెం, 25న సమిశ్రగూడెం-2, తిమ్మరాజుపాలెం, 27న శెట్టిపేట, సింగవరం గ్రామాల్లో సభలు నిర్వహిస్తామన్నారు. ఎంపీడీఓ పి.శామ్యేలు, తహసీల్దార్ గంగరాజు పర్యవేక్షణలో రెండు టీములు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తాయని ఎంపీడీఓ వివరించారు.

**నిడదవోలు:** జగనన్న సురక్ష సర్వేలో భాగంగా జేసీఎస్ పట్టణ కన్వీనర్ ఎస్‌కే చాన్‌బాషా వలంటీర్లు, గృహసారథులతో కలిసి ఆదివారం పట్టణంలోని నెహ్రూనగర్‌లో ఇంటింటికీ పర్యటించారు. జగనన్న సురక్షపై అవగాహన కల్పించారు. వలంటీర్, సచివాలయ సిబ్బంది ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారికి ఏయే ధ్రువపత్రాలు పత్రాలు కావాలో తెలసుకుని వాటిని వలంటీర్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. సరిఫికెట్లకు కావలసిన ధ్రువపత్రాల జారీకి లబ్ధిదారుల వద్ద దరఖాస్తులు తీసుకుని వారికి టోకెన్ అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కామిశెట్టి సత్యనారాయణ, వార్డు కన్వీనర్ గంటా సురేష్ పాల్గొన్నారు.

### 80 శాతం నారుమడులు పూర్తి

**ఉండ్రాజవరం:** మండలంలో రైతులు ఇప్పటికే 252 హెక్టార్ల విస్తీర్ణంలో వరి నారుమడులు పోశారని మండల వ్యవసాయాధికారి ఎం.విశ్వాసరావు ఆదివారం తెలిపారు. ఇది వరి మండల సాగు విస్తీర్ణంలో 80 శాతం అని ఆయన చెప్పారు. మిగిలిన 20 శాతం నారుమడులను రైతులు ఐదు రోజుల్లో పూర్తి చేస్తారన్నారు. ఈ ఖరీఫ్‌లో మండలంలోని 90 శాతం రైతులు ఎంటీయూ 1318 రకం, 10 శాతం పీఎల్, స్వర్ణ వంటి వరి వంగడాలను సాగు చేస్తున్నారని ఏవో తెలిపారు. ఈ ఏడాది జూన్ మొదటి వారంలోనే కాలువలకు నీటిని విడుదల చేసినప్పటికీ జూన్ 20 వరకూ రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించక పోవడంతో నారుమడులు పోయడానికి ఇబ్బంది ఏర్పడిందని వివరించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో పాటు కాలువలకు సమృద్ధిగా నీటిని విడుదల చేయడంతో రైతులు పూర్తిగా సాగు పనుల్లో నిమగ్నం అయ్యారని విశ్వాసరావు చెప్పారు.

### కోటసత్తెమ్మ వారి ఆదాయం రూ.1.75 లక్షలు

**నిడదవోలు రూరల్:** ఆషాఢ మాసం కావడంతో మండలంలోని తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ వారి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి ఆదివారం భారీగా భక్తులు తరలి వచ్చి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానా ర్చకుడు అప్పారావు శర్మ పర్యవేక్షణలో కోటసత్తెమ్మ వారికి విశేష పుష్పాలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల విక్రయం ద్వారా రూ.1,75,151 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం (శివ) పేర్కొన్నారు.

### పేకాడుతున్న నలుగురి అరెస్టు

**కొవ్వూరు:** పేకాడుతున్న నలుగురిని మండలంలోని దొమ్మేరు విద్యుత్ సబ్ స్టేషన్ వెనుక ప్రాంతంలో ఆదివారం అరెస్టు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఎస్సై డి.భూషణం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1,350 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

## నిడదవోలు రోటరీ క్లబ్‌కు అవార్డుల పంట




రోటరీ గవర్నర్ భాస్కర్‌రామ్ చేతుల మీదుగా అవార్డులు స్వీకరించిన శ్రీనివాసరావు, రోటరీ సభ్యులు

**నిడదవోలు:** సామాజిక సేవలో గుర్తింపు పొందిన రోటరీ క్లబ్ నిడదవోలు శాఖకు అవార్డుల పంట పండింది. విజయనగరంలోని ఎస్ కన్వెన్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన రోటరీ అవార్డుల ప్రదానోత్సవంలో రోటరీ- 3020 డిస్ట్రిక్ట్ స్థాయిలో నిడదవోలు క్లబ్‌కు ఉత్తమ క్లబ్‌తో పాటు వివిధ విభాగాల్లో అవార్డులు లభించాయి. రోటరీ- 3020 డిస్ట్రిక్ట్ గవర్నర్ ఏకేఎస్ భాస్కర్‌రామ్ ఈ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ నిడదవోలు శాఖ అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి ఎండీ ఫయాజ్, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, క్లబ్ రోటరీ అసిస్టెంట్ గవర్నర్ అయినీడి పల్లారావు, గోపిరెడ్డి శ్రీనివాస్, పోలదాసు శ్రీనివాసరావు, నీలం నాగేంద్రప్రసాద్, ఆకుల ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఎస్వీఆర్‌కే డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

**నిడదవోలు:** స్కిల్ హబ్, ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.జ్యోతి తెలిపారు. టీసీఎస్, కాలిబ్ హెచ్‌ఆర్, ముత్తూట్ ఫైనాన్స్, నవతా ట్రాన్స్‌పోర్టు కంపెనీల ప్రతినిధులు హాజరై సుమారు 100 ఉద్యోగాలను భర్తీ చేస్తారన్నారు. ఎంకాం, ఎంబీఏ, ఇంటర్, ఐటీఐ, పదో తరగతి అర్హత కలిగి, 19 నుంచి 30 ఏళ్ళ లోపు అభ్యర్థులు ఈ జాబ్‌మేళాకు అర్హులన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్, పాన్ జిరాక్స్ కాపీలతో పాటు రెజ్యూమ్‌లను వెంటబెట్టుకుని ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఆయా కంపెనీలను బట్టి నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు వేతనం ఇస్తారని ప్రిన్సిపల్ జ్యోతి పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 96760 52454, 95818 10049 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### వర్షాలకు రోడ్డు అధ్వానం



వేగేశ్వరపురం వద్ద ఆర్ అండ్ బీ రోడ్డు

**తాళ్లపూడి:** మలకపల్లి నుంచి ప్రక్కిలంక వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డు పెద్ద పెద్ద గోతులు పడి అధ్వానంగా మారింది. దీంతో ఈ మార్గంలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు గోతుల్లో నీరు నిలిచిపోయింది. ప్రక్కిలంక ప్రసన్న హాస్పటల్ సమీపంలో రోడ్డు గోతులు పడింది. తాళ్లపూడిలోని డీసీసీ బ్యాంక్ వద్ద నిలిచిపోయిన వర్షపు నీరు చెరువును తలపిస్తోంది. వేగేశ్వరపురంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద, బస్టాండ్, పంచాయతీ కార్యాలయాల సమీపంలోను, చెక్కల మిల్లు వద్ద, బల్లిపాడులోను పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. అందులో వర్షపు నీరు నిలిచిపోతోంది. గతంలో నామమాత్రపు మరమ్మతుల చేయడంతో పరిస్థితి పూర్వ స్థితికి చేరింది. ఇప్పటికైనా ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులకు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.